క్లుప్తంగా

స్వచ్ఛతా హీ సేవాపై ప్రదర్శన



తిరువూరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం తిరువూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ నిర్మల, కమిషనర్ మనోజ, కౌన్సిలర్లు, సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లతో ప్రదర్శనలో పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త పడేయవద్దని సూచిస్తూ ఈ ప్రదర్శన జరిగింది.

ఆర్థికాభ్యున్నతి సాధించాలి

మైలవరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే కుటుంబం, సమాజం, యావత్తు దేశం పురోగతి సాధిస్తుందని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళల ఆర్థిక స్వావలంబన-సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అంశంపై గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ షేక్ కరీముల్లా మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ఏసుబాబు



ముసునూరు: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయడం ద్వారా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు మంచి సేవలను అందిస్తానని నూతనంగా ఎంపీడీఓ బాధ్యతలు చేట్టిన పి.ఏసుబాబు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ముసునూరు ఎంపీడీఓగా గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆయనను డెప్యూటీ ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ, ఏఓ ఛాయా కుమారి తదితరులు అభినందించారు.

ఒకటి నుంచి కబడ్డీ పోటీలు

నూజివీడు: పట్టణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు 73వ అఖిల భారత పురుషుల, మహిళల కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని దసరా ఉత్సవ, క్రీడా సాంస్కృతిక ట్రస్టు ఫెస్టివల్ సెక్రటరీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 112 ఏళ్లుగా నూజివీడులో ఉత్సవాలు నిర్వహిస్తుంటే 73 ఏళ్లుగా కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, టీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో వెండి, బంగారు నగలు చోరీ

జి.కొండూరు: కుంటముక్కల గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 1.270 కేజీల వెండి వస్తువులు, 20 గ్రాముల బంగారు నగలను దొంగలు చోరీ చేశారు. హుండీని పగలకొట్టినప్పటికీ అందులో నగదు ఏమీ లేదని తేలింది. దేవాలయంలోని సీసీ కెమెరాలను ఇటీవల దేవాలయానికి రంగులు వేస్తున్న క్రమంలో స్విచ్ ఆఫ్ చేయడంతో నిందితులను పట్టుకోవడం సవాల్‌గా మారింది. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ చెరుకూరి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల మునగపాడు గ్రామంలోని దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన మరవకముందే మరో ఘటన జరగడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

ఆగిరిపల్లి: పండిట్ దీన్‌దయాళ్ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మల్లిబోయినపల్లిలో ఆయన చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు రంగారావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మాబేగం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విధిగా మాస్కులు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు ధరించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, చర్మవ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రణభేరి సభకు ఉపాధ్యాయులు

నూజివీడు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరులో గురువారం నిర్వహించిన రణభేరి కార్యక్రమానికి నూజివీడు నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పట్టణంలోని విజయవాడ రోడ్డులో ఉన్న యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్దకు ఉపాధ్యాయులందరూ ఉదయం చేరుకోగా యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు బొద్దుకోళ్ల బాబూరావులు జెండా ఊపిన అనంతరం గుంటూరు బయలుదేరి వెళ్లారు. నాయకులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం

- కాలనీలో కనీస సౌకర్యాలు కరువు
- వర్షం పడితే బురదగా మారుతున్న మట్టిరోడ్లు
- మోటారు చెడిపోతే వాడకానికీ నీరు లేక ఇబ్బందులు
- అరకొరగా వెలుగుతున్న వీధి దీపాలు
- పాముల సంచారంతో భయాందోళన



కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు



కాలనీలోని మట్టి రోడ్డు

నూజివీడు: నూజివీడు పట్టణంలోని మైలవరం రోడ్డులో ట్రిపుల్ ఐటీకి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో నివాసితులు మౌలిక సదుపాయలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను ఇచ్చి గృహాలు మంజూరు చేయగా పేదలు నిర్మించుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాలనీల్లోని సమస్యలను పరిష్కరించడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

తాగునీటి సమస్య

గత ప్రభుత్వం ఈ కాలనీలో దాదాపు 280 మందికి నివేశన స్థలాలను పంపిణీ చేసి అందరికి గృహాలను మంజూరు చేసింది. దీంతో సుమారు 150 మందికి పైగా గృహాలు నిర్మించుకోగా ప్రస్తుతం 60 మంది వరకు నివసిస్తున్నారు. ఈ కాలనీలో మున్సిపాలిటీ అక్కడక్కడా సింటెక్ ట్యాంకులు ఏర్పాటు చేసి వాటిని నింపుతున్నారు. అయితే ట్యాంక్ నుంచి నీటిని మోసుకోవాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఒక్కో సారి మోటార్ చెడిపోతే కనీసం ఇంటి అవసరాలకు కూడా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి రోడ్లే దిక్కు

జగనన్న కాలనీలో మట్టి రోడ్లు ఉండటంతో వర్షం పడితే బురదగా మారుతున్నారు. బురద రోడ్లపై ద్విచక్ర వాహనాలతో సర్కస్ ఫీట్లు చేస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. భారీ వర్షాలు పడుతుండటంతో రోడ్లపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది అవుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కచ్చా డ్రెయినేజీ కూడా లేకపోవడంతో గృహాల్లో వాడిన నీరు రోడ్లపైకి చేరి బురదమయంగా మారుతున్నాయని వాపోతున్నారు.

అరకొరగా వీధి లైట్లు

కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో కొన్నే అరకొరగా వెలుతుండటంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయమేస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎటు వైపు నుంచి పాములు, పురుగులు వస్తాయోనని భయాందోళనలకు గురవుతున్నారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఎన్ఎం రావడం లేదు

ఈ కాలనీ ట్రిపుల్‌ఐటీకి దగ్గరగా పట్టణం వెలుపల ఉండటంతో ఇక్కడకు ఏఎన్ఎం కూడా రావడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు.

రోడ్లు లేక ఇబ్బంది



జగనన్న కాలనీలో దాదాపు 60 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. సరైన రోడ్లు లేక వర్షం పడినప్పుడు బురద రోడ్లపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వీధి లైట్లు కూడా అరకొరగానే వెలుగుతుండడంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉంటోంది. మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– మాపర్తి రోషిణి, జగనన్న కాలనీ, నూజివీడు

సదుపాయాలు కల్పించాలి



ట్రిపుల్ ఐటీ ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో ప్లాస్టిక్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. మోటర్ చెడిపోతే సకాలంలో దానిని బాగు చేయించడం లేదు. నీటిని ప్రతి రోజూ మోసుకోవాల్సి వస్తోంది. రోడ్ల వెంట పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాముల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

–రామిశెట్టి ప్రకాష్, కాలనీవాసి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దూరంగా ఉన్న నేపథ్యంలో ఏఎన్ఎం కానీ, ఆశా వర్కర్ కానీ వస్తే కొంత మేరకు బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని నీరు, రోడ్లు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కాత్యాయనీ.. దానవ ఘాతినీ

మైలవరం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు గురువారం అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలవరం కేడీసీసీ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తిరువూరు రోడ్డులోని పాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధనలక్ష్మీ పాహిమాం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని దేవాలయాలు, ఉత్సవ పందిళ్లలో గురువారం అమ్మవారిని విభిన్న రూపాల్లో అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. తిరువూరు కనకదుర్గమ్మ ఆలయంలో ధనలక్ష్మీదేవిగా, చంద్రమౌళీశ్వరాలయంలో, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో, ఊటుకూరు కోదండ రామాలయంలో, గంపలగూడెం రామాలయం వీధిలోని నవరాత్రి పందిరిలో కాత్యాయనీ దేవిగా, తిరువూరు శ్రీ రామలింగేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. నెమలి వేణుగోపాల స్వామి దేవస్థానంలో నవరాత్రి వేడుకల్లో భాగంగా జరిగిన పూజాదికాల్లో ఆలయ సహాయ కమిషనర్ సంధ్య పాల్గొన్నారు.

- **జి.కొండూరు:** జి.కొండూరు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారు నాలుగో రోజు గురువారం శ్రీ కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూజివీడు: పట్టణంలోని శ్రీ కోటమహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గురువారం కాత్యాయనీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, శ్రీచక్రార్చన చేశారు. పట్టణంలోని కోనేరుపేట టీటీడీ కల్యాణ మండపం వద్ద కనకదుర్గ అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నారు. పాతపేట జ్ఞాన సరస్వతీ దేవాలయం, జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతీ దేవాలయం, 32వ వార్డులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: దసరా ఉత్సవాల సందర్భంగా గురువారం కనకదుర్గ అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

- **బలివే(ముసునూరు):** బలివేలోని బలే రామలింగేశ్వస్వామి ఆలయంతోపాటు, చెక్కపల్లి, వేల్పుచర్ల, రమణక్కపేటల్లోని కోదండ రామాలయాల వద్ద, గోపవరం, గుడిపాడు, వలసపల్లి, చింతలవల్లి శివాలయాల్లో గురువారం అమ్మవారికి మహిళలు అభిషేకాలు నిర్వహించి కుంకుమ పూజలు చేశారు. లోపూడిలో కోదండ రామాలయం వద్ద అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.
- **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలోని రుద్రభూమి వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. స్థానిక రజక వీధిలో, వేద పాఠశాలలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈదులగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఈలప్రోలు సుబ్బయ్య, నండూరి భాస్కర్ ప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వట్టిగుడిపాడు, చిన్నాగిరిపల్లి, గొల్లగూడెంలోని రేణుక క్షేత్రంలోని కృష్ణ దుర్గా అమ్మవారు గోపాల సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రం వ్యవస్థాపకుడు వీర కృష్ణ భవానీ ఆధ్వర్యంలో భక్తులు అందించిన పసుపు, కుంకుమలను అమ్మవారికి సమర్పించారు.
- **విస్సన్నపేట:** స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గురువారం కాత్యాయనిదేవిగా పూజలందుకున్నారు. పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించి పూజలు చేశారు.
- **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లి మార్కెట్ సెంటర్‌లోని దుర్గాసాధిని మాత ఆలయంలో కాత్యాయనీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. జూపూడి గంగానమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో పూజలు



బలివేలో అమ్మవారికి కుంకుమ పూజలు




మైలవరంలో కాత్యాయనీదేవిగా అమ్మవారు



పుట్రేల మారెమ్మ అమ్మవారి అలంకరణ



కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో అమ్మవారు



బూరుగుగూడెంలో పూజలు అందుకున్న అమ్మవారు



బలివేలో కాత్యాయనీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



ఆగిరిపల్లిలోని రేణుక క్షేత్రంలో గోపాల సుందరీ దేవిగా..




జి.కొండూరు బీసీ కాలనీలో..



గంపలగూడెంలో అమ్మవారి అలంకరణ



తిరువూరు శ్రీకనకదుర్గాలయంలో ధనలక్ష్మీ అలంకారం



నూజివీడులో కోట మహిషాసుర మర్ధని అమ్మవారు

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నాయని ఇన్‌చార్జి డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జాస్తి జగన్‌మోహన్ రావు అన్నారు. దిగవల్లి పీహెచ్‌సీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళలందరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

- **తాతకుంట్ల(విస్సన్నపేట):** తాతకుంట్ల గ్రామంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి కె శ్రీనివాసరావు మహిళలకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ పి. వెంకటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.
- **చాట్రాయి:** ఆరోగ్యకరమైన మహిళ శక్తివంతమైన కుటుంబాన్ని తయారు చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి అన్నారు. జనార్ధనవరం గ్రామంలో నిర్వహించిన స్వస్థ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళ ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాదు, మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మర్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నూతన కైనటిక్ లూనా ప్రైమ్



ఇబ్రహీంపట్నం: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలో ప్రఖ్యాతి గాంచిన కై నెటిక్ సంస్థ మార్కెట్‌లోకి మరో నూతన లూనా ప్రైమ్‌ను విడుదల చేసింది. లూనా ప్రైమ్ వాహనాన్ని ఇబ్రహీంపట్నం విజయదుర్గ మోటార్స్‌లో గురువారం ఆవిష్కరించారు. మొదటి వాహనం కొనుగోలు చేసిన వినియోగదారుడికి వాహన తాళాలను అందజేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ లూనా ప్రైమ్ ద్వారా పూర్తిగా కాలుష్యం నియంత్రణతో పాటు, రవాణా సులభతరం అవుతుందన్నారు. వినియోగదారుని అవసరాలకు అనుగుణంగా తక్కువ బడ్జెట్‌లో ఎక్కువ ఉపయోగాలు లభిస్తాయని చెప్పారు. విజయదుర్గ మోటార్స్ అధినేత రాంబాబు, కై నటిక్ మోటార్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శనలతో విజ్ఞానం పెంపు

మైలవరం: క్షేత్ర సందర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు అన్నారు. కళాశాల బీఏ విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా కొండపల్లి కోటను గురువారం సందర్శించారు. పురావస్తు శాఖ నిర్వహిస్తున్న మ్యూజియం, రంగమహల్, దివాన్ ఈ ఖాస్, దివాన్ ఈ ఆమ్, కోట జైలు వంటి వాటిని సందర్శించారు. నాటి కాకతీయ, రెడ్డి రాజులు, విజయనగర రాజ్యం, గోల్కొండ కుతుబ్ షాహీ రాజుల కట్టడాలు, భారతీయ పురావస్తు వారసత్వ వైభవానికి నిదర్శనంగా నిలిచాయని చరిత్ర అధ్యాపకులు ధారావతు శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు.

కళాకారులకు సన్మానం



తిరువూరు: సినీ నేపథ్య గాయకుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పలువురు కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. గాన గంధర్వుడు బాల సుబ్రహ్మణ్యం భౌతికంగా లేకున్నా అభిమానుల గుండెల్లో నిలిచి పోయారని వక్తలు కొనియాడారు. పలువురు కళాకారులు గాత్ర కచేరీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సన్మానించారు.

రెడ్డిగూడెంలో 144 సెక్షన్ అమలు

మైలవరం: రెడ్డిగూడెం మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం 144 సెక్షన్ అమలులో ఉందని సీఐ దాడి చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు రోడ్లపై గుమికూడటం, ర్యాలీలు, నిరసనలు, ముట్టడిలు, సభలు నిర్వహించడం నిషేధమని చెప్పారు.

వేతనాలు పెంచాలని వినతి



విస్సన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, ఆయాలకు వేతనాలు పెంచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్సకట్ల త్యాగరాజు విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలనెలా క్రమం తప్పకుండా బిల్లులు, వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆయాలకు నెలకు రెండు రోజులు సెలవులు ఇవ్వాలని, ప్రతి 100 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని శాసన మండలిలో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ప్రతిపక్ష శాసన మండలి నాయకుడు బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె. ప్రవంతి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణప్రసాద్



ఇబ్రహీంపట్నం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు మెప్మా చేయూత అందిస్తోందని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ అన్నారు. కొండపల్లిలో డ్వాక్రా మహిళ ఏర్పాటు చేసిన నూతన బోటిక్ షోరూంను కొండపల్లి మున్సిపల్ కమిషనర్ మోస్మి గనియాతో కలిసి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అందుకు మెప్మా తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే రక్తహీనత దూరం



ముసునూరు: గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం తీసుకుని రక్తహీనతను తరిమివేయాలని ఐసీడీఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సుజాత పిలుపునిచ్చారు. గురువారం బలివేలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను తిలకించి, సాముహిక సీమంతాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా సమతుల్య ఆహారం స్వీకరించాలని సూచించారు. ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ పనుల పరిశీలన

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో చెత్త ఏరివేత, సేకరణను చిత్తశుద్ధితో నిర్వహించాలని నూజివీడు డీఎల్‌డీఓ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని కొర్లగుంట గ్రామంలో పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి పారిశుద్ధ్య కార్మికుల ద్వారా నిర్వహిస్తున్న చెత్త సేకరణ, చెత్త ఏరివేత పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి సాయి పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులతో ఇబ్బందులు

నూజివీడు: పట్టణంలోని ప్రధాన రహదారులపై ఆవుల సంచారంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ రోడ్లపై ఆవుల సంచారం పెరుగుతున్నా మున్సిపల్ అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోకపోవడంపై పట్టణ ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. పశువుల సంచారం వల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని వాపోతున్నారు. వాటి యజమానులు పాలు తీసుకుని రోడ్లపైకి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఉంటున్న ఆవుల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.